ప్రజాశక్తి
సోమవారం 25 నవంబర్ 2024
8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

వరద బిల్లులకు మోక్షమెప్పుడో..?

- మూడు మాసాలైనా నేటికీ పైసా రాని వైనం
- కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన విఎంసి
- పెండింగ్ బిల్లుల మంజూరుకు ప్రభుత్వం మీనమేషాలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-విజయవాడ

'మింగను మెతుకు లేదు...మీసాలకు సంపెంగనూనె' అన్నట్లు విజయవాడ నగర పాలక సంస్థ పరిస్థితిపై కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధుల మాటలు కోటలు దాటుతున్నాయి. అప్పులు కుప్పై...విఎంసి ఖజానా నిండుకొని...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ పద్దుల కింద రావాల్సిన కోట్ల రూపాయల నిధులు ఏళ్ల తరబడి రాక, కనీసంగా ఇటీవల బుడమేరు వరదలకు విఎంసి ఖర్చు పెట్టిన బిల్లుల్లో పైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయలేదు. ఇటువంటి పరిస్థితుల్లో ఖజానా ఖాళీ అవుతూ...నగరపాలక సంస్థ నెలవారీ సాధారణ ఖర్చులకు కూడా ఎదురు చూడాల్సిన పరిస్థితుల్లో...విజయవాడను అన్ని హంగులతో స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతామని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఇతర ప్రజాప్రతినిధులు మీడియా సాక్షిగా చేస్తున్న వ్యాఖ్యలు...నవ్వాలో...ఏడవాలో అన్నట్లుగా ఉందని విఎంసి ఉద్యోగులు, అధికారుల నుంచి వినిపిస్తుంది. కోట్లాది రూపాయల వివిధ రకాల బిల్లులు, పెండింగ్ బకాయిలు, బ్యాంక్ అప్పులు చెల్లించడానికి నెల తిరిగి వచ్చేసరికి ఎదురు చూడాల్సి వస్తోందని విఎంసి అధికారులు వ్యక్తం చేస్తున్నారు. నగర ప్రజల నుంచి నెలవారీ వసూలు చేసే వివిధ రకాల పన్నుల ద్వారా వచ్చే డబ్బులు మినహా...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఒక్క నయాపైసా డబ్బులు వచ్చే పరిస్థితి (మిగతా 2లో)

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా మహాసభలో ఎంఎల్‌సి లక్ష్మణరావు
- నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసరావు, సుందరయ్య

యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

శ్రీనివాసరావు, సుందరయ్య

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని శాసన మండలి సభ్యులు కె.ఎస్‌లక్ష్మణరావు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రథమ మహాసభ విజయవాడలోని ఎం.బి.భవన్‌లో ఆదివారం జరిగింది. ఎన్‌టిఆర్ జిల్లా నూతన కార్యవర్గం 60 మందితో ఏర్పాటైంది. నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య ఎన్నికయ్యారు. సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, అందుకే ఓడిపోయిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా ఉద్యోగుల, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఆలోచించే విధంగా తక్షణమే ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని అన్నారు. 12వ పిఆర్‌సి కమిటీ సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించాలన్నారు. మాజీ ఎంఎల్‌సి బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ యుటిఎఫ్ పెద్ద సంఘంగా ఘన కీర్తి గడించడంలో చాలా మంది నాయకులు, కార్యకర్తల జీవిత త్యాగాలు ఉన్నాయని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని (మిగతా 2లో)

లక్ష్యసాధన దిశగా ఉపాధి పనులు

- ఇప్పటి వరకు 60.92 లక్షల పనిదినాలు
- డ్వామా పీడీ శివప్రసాద్‌యాదవ్



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనులు జరుగుతున్నాయని డ్వామా పీడీ ఎన్.వి.శివప్రసాద్‌యాదవ్ అన్నారు. ఆర్థిక సంవత్సరంలో నిర్ధేశించిన లక్ష్యం మేరకు ఉపాధి పనులు కల్పించడం జరుగుతుందని వివరించారు. గ్రామీణ రహదారులకు ఇరువైపులా, కాలువ కట్టలుపైన మొక్కలు నాటడం, పల్లెవనాలు, నర్సరీల పెంపకం వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. పామాయిల్, నిమ్మ తోటల నిర్వహణకు ఉపాధి చట్టం ద్వారా రైతులకు అవసరమైన సహకరం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మెటీరియల్ కాంపోనెంట్‌తో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున సాగుతున్నాయని ఉపాధి హామీ పనులపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో శివప్రసాద్ యాదవ్ తెలిపారు.

ప్రశ్న: జాతీయ ఉపాధి హామీ చట్టం లక్ష్యం ఎంత పూర్తయింది?

జవాబు: 2024-25 ఆర్థిక సంవత్సరంలో కృష్ణాజిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు 80 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా (మిగతా 2లో)

యశ్వంత్‌కృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అజయ్

ఈతకెళ్లి ఇద్దరు బాలురు మృతి

వార్త మెయిన్‌లో

ప్రజా సమస్యలపై అధ్యయనం

- సిపిఎం విజయవాడ తూర్పు నగర కమిటీ మహాసభ తీర్మానం
- నూతన కార్యదర్శిగా పి.కృష్ణ ఎన్నిక

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి వాటిపై వివిధ రూపాల్లో ఉద్యమించాలని సిపిఎం విజయవాడ తూర్పు నగర కమిటీ మహాసభ తీర్మానించింది. సిపిఎం విజయవాడ తూర్పు నగర కమిటీ 23వ మహాసభ సీతారామ్ ఏచూరి నగర్ (పూలే-అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం, సున్నపుబట్టీల సెంటర్)లో ఆదివారం జరిగింది. మహాసభల ప్రారంభ సూచికగా సున్నపుబట్టీల సెంటర్‌లో సిపిఎం పతాకాన్ని తూర్పు నగర కమిటీ కార్యదర్శి బోజడ్ల నాగ్వేరరావు ఆవిష్కరించారు. సిపిఎం విశిష్టతపై ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు. మహాసభ పలు తీర్మానాలను ఆమోదించింది. కృష్ణలంకలోని భ్రమరాంబపురం, హరినాథపురం, ఇందిరాకాలనీ ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని, కృష్ణాకరకట్ట ప్రాంత ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని, రిటైనింగ్ వాల్ నిర్మాణం లోపాలను సరి చేసి పటిష్టపరచాలని, మొగల్‌రాజపురం కొంత ప్రాంత పట్టాలు, కొంత ప్రాంత సమస్యలను పరిష్కరించాలని, రివర్ కన్సర్వేటివ్ యాక్ట్, జిఓ నెంబర్ 119 వల్ల (మిగతా 2లో)

17 మందితో నూతన కమిటీ

విజయవాడ తూర్పు నగర కమిటీ 17 మందితో ఏర్పాటైంది. నూతన కార్యదర్శిగా పి.కృష్ణ ఎన్నికయ్యారు. కార్యదర్శి వర్గ సభ్యులుగా బి.చిన్నారావు, జి క్రాంతి, కె రమణ, చంద్రశేఖర్, మరో 11 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు.

కృష్ణ

మొదటిపేజీ తరువాయి

ప్రజా సమస్యలపై అధ్యయనం

ఆగిపోయిన ఇళ్లకు ప్లాన్ ఇవ్వాలని, ప్రమాదాల నివారణకు రాజీగారితోటలో హైవేపై సబ్‌వేను నిర్మించాలని, ట్రూ అప్ ఛార్జీల భారాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను పెట్టవద్దని, అంతర్గత రోడ్లు, డ్రైయినేజ్ సమస్యలను పరిష్కరించాలని, ఆటోనగర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఆటోనగర్ చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని మహాసభ తీర్మానించింది. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ దేశాన్ని కాపాడాలన్నా, ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్నా దేశ రాజకీయాల్లో సిపిఎం, కమ్యూనిస్టుల అవసరం నేడు మరింత పెరిగిందన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసి, ఆర్థిక కుంభకోణాలకు పాల్పడుతున్న ఆదానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు ప్రజాసంపదను దోచిపెట్టే కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను మార్గ్యగలిగిన శక్తి, బలం, ధైర్యం ఎర్రజెండాకు, కమ్యూనిస్టులకే ఉందని ఉద్ఘాటించారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ విధానాలను అమలు చేస్తూ ట్రూ అప్ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై 17 వేల కోట్ల రూపాయల విద్యుత్ భారాలను మోపుతుందని, అదే విధంగా ఉరితాళ్లగా తయారైన స్మార్ట్ మీటర్ల భారాన్ని ప్రజలపై మోపుతుందని, ఈ భారాలను ప్రజలకు వివరించి, ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ప్రజాసంఘాలను బలోపేతం చేసుకుని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేస్తూ పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె శ్రీదేవి, బోయి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

దొడ్ల రామారావు మృతి తీరనిలోటు

సంస్మరణ సభలో వక్తలు



ప్రజాశక్తి-భవానీపురం

స్వరాష్ట్ర ఉద్యమ నేత దొడ్ల రామారావు మృతి రాష్ట్రానికి తీరని లోటని పలువురు వక్తలు నివాళు లర్పించారు. సోషలిస్టు నాయకునిగా, స్వరాష్ట్ర ఉద్యమ నేతగా ప్రజలందరికీ ఆయన చిరకాలం గుర్తుండే నాయకుడని అన్నారు. తీర్థయాత్రలు నిర్వహణ తపస్వి, దొడ్ల టూర్స్ అండ్ ట్రావెల్స్ అధినేత దొడ్ల రామారావు సంస్మరణ సభ ఆదివారం విద్యాధరపురం సితార సెంటర్‌లోని ఎస్.కన్వెన్షన్‌లో జరిగింది. మాజీ మంత్రి, రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, విఎంసి ఫ్లోర్ లీడర్ సత్యనారాయణ (అరవ సత్యం), పలువురు కార్పొరేటర్లు రామారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ చిరకాల మిత్రుడు, ప్రముఖ సోషలిస్ట్ నాయకులు దొడ్ల రామారావు మృతితో తీవ్ర దిగ్భ్రాంతి చెందామని అన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ దొడ్ల టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా యాత్రికులను అనేక తీర్థయాత్రకు తీసుకువెళ్లి పుణ్య కార్యక్రమాలు నిర్వహించిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామారావు సతీమణి రాజ్యలక్ష్మి, కుమారుడు హేమంత్‌కుమార్, కోడలు వెంకటలక్ష్మి, కుమార్తెలు పద్మావతి, కనకమ్మ, లక్ష్మీ జగదీశ్వరి, సుజాత, అల్లుడు పల్లంటి గంగాధర్, గుండు శ్రీనివాస్, కళ్యాణ్, శ్రీరామచంద్రమూర్తి, మనవడు హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కాపాడటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉండాలన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులకు లేని ఆన్లైన్ వర్క్ నేడు ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉండటం వల్ల పిల్లలకు నాణ్యమైన విద్యనందించే పరిస్థితి లేదన్నారు. విలువైన బోధనా సమయం దుర్వినియోగం అవుతుందన్నారు. జిఒ 117 రద్దు చేయాలని కోరారు. టీచర్ల బదిలీల సందర్భంగా రూపొందించే బదిలీ చట్టంపై సమగ్ర చర్చ జరిపి, ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను తీసుకుని రూపొందించాలని కోరారు. డిఎస్‌సి నోటిఫికేషన్‌లో అన్ని ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల జరుపుకుంటున్న సందర్భంగా 50 సంవత్సరాల కాలంలో యుటిఎఫ్ రూపొందించిన విజయాల గురించి వివరించారు. సభలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్, పూర్వ రాష్ట్ర కార్యదర్శి కె.సంజీవరెడ్డి, సిఐటియు నాయకులు డి.వి.కృష్ణ మాట్లాడారు. అనంతరం యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరయ్య నివేదిక ప్రవేశపెట్టారు. మహాసభ సందర్భంగా తొలుత జాతీయ జెండాను యుటిఎఫ్ వ్యవస్థాపక నాయకులు వి.రంగారావు, ఎస్‌టిఎఫ్ఐ జెండాను కె.తిరుపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, మచ్చ శ్రీనివాస్, ఎం.కృష్ణయ్య, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 25వ తేదీ సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. అలాగే నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సర్కిల్-1 కార్యాలయం నుండి కమిషనర్ ధ్యానచంద్ర అర్జీలు స్వీకరించనున్నారు. సర్కిల్ 1 కార్యాలయంతో పాటు సర్కిల్ 2, 3, కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతులు స్వీకరించనున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక కృష్ణలంక పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌ను, ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఎన్‌టిఆర్ జిల్లా ప్రత్యేకాధికారి జీపీహెచ్ కొండారెడ్డి ఆదివారం పరిశీలించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన 145,147, 155,179, 180, 182, 187 పోలింగ్ బూత్‌లను పరిశీలించి, స్థానిక ఓటరు నమోదు కార్యక్రమం సిబ్బంది నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ బూత్‌ల పరిసరాలు, అక్కడి ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించిన ప్రత్యేకాధికారి సంతృప్తిని వ్యక్తం చేశారు.

వరద బిల్లులకు మోక్షమెప్పుడో..?

లేదని అటు కార్పొరేటర్లు, ఇటు అధికారులు సైతం బహటంగానే చెబుతున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో సెప్టెంబర్‌మాసంలో వచ్చిన బుడమేరు, కృష్ణానది వరద ప్రళయానికి సింగ్‌నగర్‌తో పాటు వన్‌టౌన్ దాదాపుగా 32 డివిజన్ల ప్రజలు వివిధ రూపాల్లో పెద్ద ఎత్తున నష్టపోవడంతో పాటు ఆయా ప్రాంతాల ప్రజలు నేటికీ కూడా కోలుకోలేని వైనం అందరికీ తెలిసిన విషయమే. పలు ప్రాంతాలు పూర్తిగా దెబ్బతిని, వాటి రూపురేఖలు మారిపోయాయిన విషయం కూడా తెలిసిందే. ఇటువంటి నేపథ్యంలో వరద సమయములో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విజయవాడ నగరపాలక సంస్థ వివిధ రూపాల్లో చేసిన కోట్లది రూపాయల ఖర్చుకు సంబంధించిన బిల్లులు నేటికీ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. వరదలకు రెండు వందల కోట్ల వరకు వివిధ రూపాల్లో విఎంసికి నష్టం వాటిల్లినట్లు, వాటిల్లో సుమారు వంద కోట్లకు పైగా విఎంసి ఖజానా నుంచి డబ్బును వివిధ రూపాల్లో ఖర్చు చేయాల్సి వచ్చిందని సంబంధిత అధికారుల వద్ద నుంచి సమాచారం వినిపిస్తుంది. పునరావాస శిబిరాల ఏర్పాటు, వరదల్లో చిక్కుకున్న వారిని బయటకు తరలింపు, సుమారు వారం, పది రోజుల పాటు వరద బాధితులను వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందించడం, శానిటేషన్ నిర్వహణకు రాష్ట్ర నలుమూలల నుంచి తరలి వచ్చిన శానిటేషన్ కార్మికులు, శానిటరీ ఇనిస్పెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు, ప్రజారోగ్య నిర్వహణ, వివిధ రకాల సివిల్ వర్క్స్ ఇలా అనేక రూపాల్లో విఎంసి చేత భారీ స్థాయిలోనే ప్రభుత్వం ఖర్చు చేయించింది. కానీ వరదలు పోయి మూడు మాసాలు అయినా వరద సమయములో విఎంసి ఖర్చు చేసిన వాటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి జరగాల్సిన చెల్లింపులు నేటికీ అతీగతీ లేకుండా పోయినట్లు సమాచారం. ఒక వైపున పెరిగిపోతున్న ఖర్చులు...(సర్వం సాధారణ నిధుల నుంచే ఖర్చు చేయాల్సి రావడం), తరిగిపోతున్న విఎంసి ఖజానా, పెండింగ్ బిల్లులు మంజూరు అంశంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో నగర కమిషనర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. వరద సమయములో వివిధ రూపాల్లో చేసిన ఖర్చులకు సంబంధించిన సివిల్ వర్క్స్ కాంట్రాక్టర్ల దగ్గర నుంచి శానిటేషన్ కాంట్రాక్టర్లు, ఇతర బిల్లులకు సంబంధించిన వారు ఆనాటి నుంచి నేటి వరకు నిత్యం విఎంసి చుట్టూ కాళ్లరిగేటట్లు తిరుగుతున్నా...సదరు కమిషనర్ వారికి చెప్పలేక తీవ్ర ఇబ్బందులు పడుతునట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సిన వరద పెండింగ్ బిల్లుల అంశంపై విజయవాడ ఎంపి, ఎమ్మెల్యేల ఎదుట కమిషనర్ మొరపెట్టుకున్నట్లు తెలిసింది. వివిధ పద్దుల కింద విఎంసికి ప్రభుత్వం నుంచి రావాల్సిన కోట్లాది రూపాయల బిల్లుల అంశం ఏమో కానీ...కనీసంగా వరదల్లో చేసిన ఖర్చులకు సంబంధించిన బిల్లులు మంజూరు అయ్యేటట్లు మాట్లాడండి సార్... అంటూ విఎంసి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రెండు రోజుల క్రితం అధికారులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా ఎం.పి, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే దృష్టికి నగర కమిషనర్ తీసుకెళ్లినట్లు తెలిసింది. వరదలకు సంబంధించి విఎంసికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎంతెంత రావాలో ఒక లెటర్ రాసి తనకు ఇచ్చినట్లయితే ప్రభుత్వంతో తాను మాట్లాడతానని ఆ సందర్భంగా ఎంపి శివనాధ్ అన్నట్లు విశ్వసనీయ సమాచారం. వరదకు సంబంధించిన పెండింగ్ బిల్లులను స్కాన్ చేసి పంపించినట్లయితే పరిశీలించి మంజూరు చేయడం జరుగుతుందని ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ... ఆ బిల్లులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ సంతకాలు చేసే పనిలో సంబంధిత అధికారులున్నారు. మరొక వైపున వరదలకు వివిధ రూపాల్లో నష్టపోయిన వేలాది కుటుంబాల వరద బాధితులకు నేటికీ కూడా అరకొరగా సాయం అందని వైనం, బాధితులు నేటికీ జిల్లా కలెక్టరేట్, వివిధ సచివాలయాల చుట్టూ తిరుగుతున్న వైనం సర్వసాధారణమైంది. వరద బాధితులను ఆదుకోవాలని సిపిఎం, వామపక్షాలు, ప్రజాసంఘాలు నేటికీ ఆందోళనలు చేస్తూనే ఉన్నాయి. ఐదారు వందల కోట్లు వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు వచ్చినా...అటు వరద బాధితులను ఆదుకోవడంలోకానీ, ఇటు విఎంసికి చెల్లించాల్సిన బిల్లులను చెల్లించడంలో ప్రభుత్వం నేటికీ మొద్దు నిద్రపోతున్న క్రమంలో ప్రజాప్రతినిధులు ప్రకటనలకే పరిమితం అవుతూ కాలక్షేపం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలు జరిగి ఐదు మాసాలు గడిచినా, వరదల్లో సర్వం కోల్పోయి నగర ప్రజలు అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నా... ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదని విఎంసి అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులు మంజూరు చేసి, విఎంసిని, ప్రజలను ఆదుకోవాలని పోరాటసంక్షేమ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

లక్ష్యసాధన దిశగా ఉపాధి పనులు

తీసుకున్నాం. ఇప్పటి వరకు 60.92 లక్షల పనిదినాలు కల్పించాం. ఈ పని దినాల్లో 32,94,564 మంది 54.08 శాతం మహిళలకు పనిదినాలు కల్పించడం జరిగింది. ఉపాధి పనులకు వచ్చే కూలీలకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వం రోజుకు రూ. 300 చెల్లిస్తోంది. తప్పు కొలతలను పరిగణలోకి తీసుకున్నప్పుడు ఒకొక్కరికి సగటున రూ. 290 కూలి అందుతోంది. ఇప్పటి వరకు రూ. 150. 15 కోట్లు కూలీలకు వేతనాలు చెల్లించాం. ప్రస్తుతం రోజువారీ 3 వేల మంది పనులకు వస్తున్నారు. వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత ఉపాధి పనులకు ఎక్కువ మంది వస్తారు. లక్ష్యం పూర్తవుతుంది.

ప్రశ్న: వంద రోజులు ఉపాధి పొందిన కుటుంబాలున్నాయా?

జవాబు: జిల్లాలో 2 లక్షల 13 వేల జాబ్ కార్డులున్నాయి. ఈ కుటుంబాల్లో 3 లక్షల 77 వేల మంది ఉపాధి పనులకు వస్తున్నారు. జాబ్‌కార్డుల ప్రకారం సగటు 43.14 రోజులు పనిదినాలు కల్పించాం. 8043 జాబ్ కార్డుదారులకు 100 రోజుల పనిదినాలు కల్పించాం.

ప్రశ్న: మెటీరియల్ కాంపోనెంట్ పనులకు ఎంత కేటాయించారు?

జవాబు: గ్రామాల్లో రూ. 179.13 కోట్ల విలువైన మెటీరియల్ కాంపోనెంట్ పనులు జరుగుతున్నాయి. రూ. 159 కోట్లతో 1824 సిమెంట్ రోడ్లు, రూ. 18 కోట్లతో 1225 మినీ గోకులాలు, 57 కాంఫౌండ్ వాల్స్, 14 స్మశానవాటికల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

ప్రశ్న: లక్ష్యం మేరకు గ్రామీణ ప్రాంతాల్లో మొక్కలు నాటారా?

జవాబు: గ్రామీణ రహదారులు, కాలువ గట్లు పక్కన మొక్కలు నాటుతున్నాం. ఈ ఏడాది గ్రామీణ ప్రాంతంలో రహదారులకు ఇరువైపులా 68 కిలో మీటర్లు మొక్కలు నాటాలని లక్ష్యంగా తీసుకున్నాం. లక్ష్యాన్ని మించి 120 శాతం వరకు 77 కిలోమీటర్లు మొక్కలు నాటాం. 170 కిలో మీటర్లు కాలువగట్లపై మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా 160 కిలోమీటర్లు పూర్తయింది.

ప్రశ్న: పల్లెవనాలు, నర్సరీలు ఎక్కడెక్కడ పెంచుతున్నారు?

జవాబు: గ్రామీణ ప్రాంతంలో 25 సెంట్ల ప్రభుత్వ భూమిని గుర్తించి పండ్లు, నీడ నిచ్చే చెట్లు నాటుతున్నాం. గన్నవరం మండలం వీరపనేనిగూడెం హైస్కూల్, బంటుమిల్లి డిగ్రీ కాలేజీ, పామర్రు మండలం ఉరుటూరులో పల్లెవనాలు అభివృద్ధి చేస్తున్నాం. వీరపనేనిగూడెం, పెదన మండలం నడుపూరు, గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్, పెదపారుపూడి మండలం వానపాముల, పామర్రు మండలం అడ్డాడ, అవనిగడ్డ మండలం పులిగడ్డ జలవనరులశాఖ స్థలంలోని నర్సరీల్లో ఈ ఏడాది ఆరు లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 12 ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా 12 పాఠశాలల్లో పూర్తి చేశాం.

ప్రశ్న: ఉద్యాన పంటలకు ఎటువంటి ప్రోత్సాహం అందుతోంది?

జవాబు: ఉద్యాన పంటల్లో పామాయిల్, నిమ్మ, మునగ పంటల సాగుకు ఉపాధి చట్టంలో ప్రోత్సహిస్తున్నాం. జిల్లాలో 615 ఎకరాల్లో పామాయిల్ తోటలు విస్తరించాల్సి ఉండగా 580 ఎకరాల్లో పూర్తి చేశాం. 30 ఎకరాల్లో మునగ తోటలు నాటాల్సి ఉండగా 22 ఎకరాల్లో పూర్తి చేశాం.

కరపత్రాల పంపిణీ

బంటుమిల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బంటుమిల్లి : అఖిల భారత సంయుక్త కిసాన్ మోర్చ , ట్రేడ్ యూనియన్, ప్రజా సంఘాల పిలుపు మేరకు ఈనెల 26న మచిలీపట్నం లో జరిగే ర్యాలీ, సభను జయప్రదం చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో బంటుమిల్లిలో కరపత్రాలు ఆదివారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న రైతు సంఘం కష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించే చట్టం చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం బంటుమిల్లి కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధనరావు, సిఐటియు నాయకులు మాజేటి శివ శ్రీనివాసరావు, వంగల రాజా, రైతులు గౌరి శెట్టి నారాయణ, గౌరిశెట్టి గంగా వరప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగిశెట్టి కష్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు :** కోడూరు మండలంలోని ప్రధాన సెంటర్లో వర్తక షాపులలో ప్రజాసంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు పోలబత్తిన మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ నిలిపివేయాలని, కనీస వేతనం 26 వేలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. నూతన పెన్షన్ స్కీం రద్దు చేయాలని పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ చేయాలని, ప్రజా పంపిణీ పథకాన్ని ఆహార భద్రత కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులకు రోజుకు 600 వేతనం ఇచ్చి 200 రోజులు పని దినాలు కల్పించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం నాయకులు కోపనాతి తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో...

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నదివైపు దూసుకెళ్లిన బస్సు

● తప్పిన పెను ప్రమాదం

ధ్వంసమైన బస్సు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : మండలంలోని ఐలూరు గ్రామం వద్ద కృష్ణా కరకట్టపై ప్రయాణి స్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కృష్ణానది పాయ వైపు దూసుకెళ్లింది. 37 మంది ప్రయాణికులతో అవని గడ్డ నుంచి విజయ వాడ వైపు వెళుతున్న ఏపీ 16 జెడ్ 0161 ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఐలూరు వద్దకు రాగానే కరకట్ట పై ఉన్న గోతులలో అదుపుతప్పి 20 అడుగుల లోతులో ఉన్న కష్ణానదిపాయ వైపు పొలాలలోకి దూసుకెళ్లింది. కరగట్టపై ఉన్న పెద్ద పెద్ద గోతులలో బస్సు అదుపుతప్పి వేప చెట్టుకు ఢీ కొట్టింది. బస్సు ముందర టైరు ఊడిపోవడంతో నేలకు రాసుకుంటూ కరకట్ట పైనుంచి 20 అడుగుల లోతు ఉన్న పొలాలలోకి దూసుకెళ్లింది. బస్సు బోల్తాలు పడకపోవడంతో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. బస్సు ముందర అద్దాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి.ఎస్సై ఎం. అర్జున్ రాజు సంఘటన స్థలానికి చేరుకొని డ్రైవర్ మహేష్, కండక్టర్ నుంచి వివరాలు సేకరించి ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా వేరే బస్సులో ఎక్కించారు.

బహుమతులు అందిస్తున్న బుద్ధప్రసాద్

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : సమాజానికి జగ్గీ వాసుదేవ్ గురుజీ ఎన్నో సేవలు అందిస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. ఆదివారం అవనిగడ్డ ప్రభుత్వ హై స్కూల్ క్రీడా మైదానంలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 16వ ఇషా గ్రామోత్సవం సౌత్ ఇండియా లెవెల్ గ్రామీణ క్రీడ ఉత్సవం రూరల్ ప్రీమియర్ లీగ్ 2024 నిర్వహించార.ు ఈ సందర్భంగా వాలీబాల్, త్రో బాల్ పోటీలు జరిగాయి. అనంతరం సాయంత్రం బహుమతి ప్రధానోత్సవ సభకు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉదయం నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో తాళ్లపాలెం జట్టు విన్నర్‌గా నిలవగా, మాట్లాం జుట్టు రన్నర్ గా నిలిచింది. త్రో బాల్ పోటీలలో అశ్వరావుపాలెం బాబా జట్టు విన్నర్గా నిలవగా, భావదేవరపల్లి స్వయం శక్తి జట్టు రన్నర్‌గా నిలిచింది.అనంతరం క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి మతి శ్రీనివాసరావు, ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు భరత్ మోహన్, గన్నే లక్ష్మి, కవిత పాల్గొన్నారు.

అదానీని అరెస్టు చేయాలని నిరసన

నెహ్రూచౌక్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - గుడివాడ : అదానీతో పాటు ఆయన తోడు దొంగలను తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నెహ్రుచౌక్ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కుంభ కోణంలో కోట్లాది రూపాయలు దోచు కున్న అదానీని, అతని దగ్గర లంచాలు తీసుకున్న ద్రోహులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దోచుకుంటున్న కార్పోరేట్ సంస్థలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనకేసుకు రావటం సిగ్గుచేటన్నారు. అదానీతో చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేసి, దోషులను శిక్షించే వరకూ తమ పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, ఐద్వా పట్టణకార్యదర్శి పి. రజిని, భవన నిర్మాణ కార్మికసంఘం పట్టణ కార్యదర్శి రేపాని కొండా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, సిపిఎం పార్టీ సభ్యులు లంకా సురేంద్ర, విజయ్‌కుమార్, వెంకటరావు, రాంబాబు, హుసేను, హరీష్, కాటమరాజు తదితరులు పాల్గొన్నారు.

మారుతికి ఉత్తమ క్రీడా పురస్కారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఘంటసాల మండలం గోగినేనివారిపాలెం జడ్పీ హైస్కూల్లో పీడీగా పనిచేస్తున్న అవనిగడ్డ కు చెందిన గరికపాటి మారుతికి ఉత్తమ క్రీడా పురస్కారం అవార్డు అందజేశారు. డెమొక్రటిక్ పిఆర్‌టియు ఉపాధ్యాయ సేవాదళ్ ఆధ్వర్యంలో విజయవాడలో మేజర్ ధ్యాన చంద్ స్మారక క్రీడా పురస్కారాలు ప్రధానం ఆదివారం జరిగింది. ఈ వేడుకల్లో మారుతికి డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ ఆంధ్రప్రదేశ్ దేవానంద రెడ్డి చేతులు మీదుగా ఈ అవార్డు అందుకున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఫిర్యాదిదారుడు మాదాల శ్రీనివాసరావు

వంశీపై ఫిర్యాదు

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం) : గత వైసిపి ప్రభుత్వంలో ఆరుగొలను గ్రామంలో నిర్వహిస్తున్న తన ఎరువుల షాపును అక్రమంగా అప్పటి వైసీపీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఆదేశాలతో తన అనుచరులతో కూల్చివేయించారని వంశీపై బాపులపాడు మండలం తిప్పనగుంట గ్రామానికి చెందిన మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు మాదాల శ్రీనివాసరావు హనుమాన్ జంక్షన్ పోలీస్‌స్టేషన్లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన అనంతరం శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ తనను వైసీపీలోకి రావాలని బలవంతం చేశారని, తాను ఎంతకీ పార్టీ మారనని చెప్పడంతో తన ఆస్తులపై దాడిచేసి ధ్వంసం చేశారని, తనకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. సుమారు కోటి రూపాయల వరకు నాకు నష్టం వాటిల్లిందన్నారు. ఫెర్టిలైజర్ షాపు ధ్వంసం చేసి అందులో ఉన్న ఎరువులను పురుగుల మందులను వైసీపీ నాయకులు వంశీ అనుచరులు దౌర్జన్యంగా అమ్ముకున్నారని రిపోర్టులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు మండల పార్టీ అధ్యక్షులు దయ్యాల రాజేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి పుట్టా సురేష్, మాజీ తెలుగు రైతు మండల అధ్యక్షులు కొమ్మారెడ్డి రాజేష్, మువ్వా వేణుగోపాల్, తుమ్మల బ్రహ్మాజీ, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సందడిగా వన సమారాధనలు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం వాకర్స్ అసోసియేషన్ వన సమారాధన కార్యక్రమం చిన్న ఆవుటపల్లి పరిధిలోని పామాయిల్ తోటలో ఆదివారం సందడిగా జరిగింది. ఆటలు, పాటలు, డాన్సులతో పిల్లలు, మహిళలు సందడి చేశారు. సినిమా పాటలకు యువకులు చిందేశారు. గొల్లనపల్లి హైస్కూల్ హెచ్‌ఎం జగదీశ్వరరావు క్విజ్ పోటీలను ఆర్గనైజ్ చేశారు. ఆరు టీంలు ఇందులో పాల్గొని గెలుపొందడానికి ఎంతో పోటీపడ్డాయి. క్విజ్ లో అడిగిన రామాయణ, మహాభారతంలోని ప్రశ్నలు మెదడుకు పదును పెట్టాయి. కార్తీక మాసంలో సంప్రదాయబద్ధంగా వన సమారాధన కార్యక్రమం పెట్టి వాకర్స్ కుటుంబ సభ్యులందరినీ భాగస్వాములు చేశామని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.ఆర్ కిషోర్ తెలిపారు. వాకర్ సభ్యులు తిరివీధి వెంకయ్య, బ్రహ్మారెడ్డి, కోటేశ్వరరావు, గొట్టం రవి బాబు, సాంబశివరావులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. చెట్ల నీడన భోజనాలు చేశారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డలోని రేపటి కోసం మనం అనే చైల్డ్హుడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నాలుగవ వార్షిక వన సమారాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని పాత ఎడ్ల లంక లోని కనగాల సత్యం మామిడి తోటలో చైల్డ్ హుడ్ గ్రూప్ అధ్యక్షులు మత్తి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఆ గ్రూప్ సభ్యులు సికింద్రాబాద్ మహంకాళి టెంపుల్ ఆలయ అర్చక పండితులు జమ్మలమడక భాస్కర శర్మ ఆధ్వర్యంలో ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని దీపాలంకరణ నిర్వహించారు. సెక్రెటరీ దివి లీలా కష్ణ, కుందేటి రత్నాకర్, దాకారపు శ్రీనివాసరావు, సింహాద్రి రత్నారావు, రాజేష్, స్టార్ రావు, ఎన్ రామ్మోహన్ పసుపులేటి రామ్మోహన్, తమ్మిలి ప్రసాద్ పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో చెడు నడత కలిగి, వివిధ కేసుల్లో ఉండి, ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తున్న వారందరికీ ఆదివారం పోలీసులు అవగాహన కల్పించారు. ఎటువంటి వివాదాలకు పోకుండా మంచిగా ఉంటామని వారితో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా నందిగామ ఎస్ఐ అభిమన్యు మాట్లాడుతూ నందిగామ టౌన్, మండల పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు తావు లేదని అటువంటి చర్యలు చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నందిగామ టౌన్ సిఐ వైవిఎల్.నాయుడు ఇతర సిబ్బంది కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు.

హెరిటేజ్ మిల్క్ డెయిరీ పార్లర్ నూతన ఫ్రాంచైజీ ప్రారంభం

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన హెరిటేజ్ మిల్క్ డెయిరీ పార్లర్ నూతన ఫ్రాంచైజీ ప్రారంభోత్సవంలో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పాల్గొన్నారు. ఫ్రాంచైజీ ఓనర్ మొగిలి వెంకట ప్రసాద్ ఆహ్వానం మేరకు ప్రత్తిపాటి శ్రీధర్, బిజెపి కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, టిడిపి డివిజన్ అధ్యక్షులు రేగళ్ల లక్ష్మణరావు, హెరిటేజ్ డివిజనల్ మేనేజర్ అర్.ఎమ్.మస్తాన్, గొల్లపూడి బ్రాంచ్ మేనేజర్ వెంకట్రావు, విశ్వనాధుని బాలకాశిరావు పాల్గొన్నారు. డిస్ట్రిబ్యూటర్ మొగిలి వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రారంభించిన హెరిటేజ్ నూతన శాఖ లాభాల బాటలో పయనించాలని వారు ఆకాంక్షించారు.

రోడ్డు సుందరీకరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

పశ్చిమ నియోజకవర్గంలోని 53వ డివిజన్ పరిధిలో ఉన్న గణపతిరావు రోడ్డు సుందరీకరణ పనులలో భాగంగా ఆదివారం 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు పరిశీలించారు. పాతబస్తీలో కూడా ఇరుకుగా ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి పరిరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. విజయవాడ నగరాన్ని సుందరంగా, కాలుష్య రహితంగా తీర్చి దిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్క్ సూపర్‌వైజర్ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎన్. చెన్నకేశవరావు, కంచి బాబు, గ్రంధి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలి

ప్రజాశక్తి - తిరువూరు : ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చిరు వ్యాపారాలు చేసుకోవాలని ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. తిరువూరు చీరాల సెంటర్‌లో బాంబేడయింగ్ షాప్ ఎదురుగల మెయిన్ రోడ్డు పక్కన పార్కింగ్ స్థలంలో ఆయన పరిశీలించారు. మెయిన్ రోడ్డులో ట్రాఫిక్‌కు ఇబ్బందులు రాకుండా ఎంఎల్‌ఎ పలు సూచనలు చేశారు. తోపుడు బండ్లు పెట్టుకునేందుకు అక్కడే తగిన స్థలాన్ని అయన చూపించారు. అనంతరం రైతు బజార్‌ను సందర్శించి వ్యాపారులతో మాట్లాడారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా...

'అయ్యో'దేవర కాళేశ్వరరావు భవన్

ప్రజాశక్తి- నందిగామ : అయ్య దేవర కాళేశ్వరరావు భవన్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. రూ. 30 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేసినా నిరుపయోగంగా దర్శనమిస్తుంది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా భవనం తయారైంది. ఏదైనా ప్రభుత్వ భవనానికి ఉపయోగించుకోవాలని స్థానికుల విన్నపం చేసుకుంటున్నారు. నందిగామ మధిర రోడ్‌లో గల స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు స్థలంలో గతంలో దేవినేని ఉమామహేశ్వరరావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పాలిటెక్నిక్ భవనంగా ఉపయోగించారు. తర్వాత మహిళలకు కుట్టుమిషన్లు నేర్పుతూ చాలా ఉపయోగపడింది. తర్వాత కాలంలో నిరుపయోగంగా ఉన్న భవనాన్ని గత ప్రభుత్వంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం వస్తుందన్న పేరుతో 30 లక్షల రూపాయలతో మరమ్మతులు చేసి అధునాతనంగా సుందరీకరణ చేశారు. అనంతరం గత ఎన్నికల్లో ఓటరు కేంద్రాలుగా కూడా ఉపయోగించుకున్నారు. అనంతరం దాన్ని వదిలేయడంతో అది అసాంఘిక కార్య కలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో మందు తాగటం ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడం తలుపులు విరగొట్టడంతో తలుపులు విరిగి కింద పడి ఉన్నాయి. చుట్టూ మధ్యలో పిచ్చి కంప పెరిగి విష పురుగులు చేరి ఉన్నాయి. కాబట్టి లక్షల రూపాయలు విలువైన భవనాన్ని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం దిశగా ఏదన్న ప్రభుత్వ కార్యాల యం ఏర్పాటు చేసి అంద రికీ అందుబాటులో ఉండేట్లు చూడాలని లేదా కేంద్రీ విశ్వవిద్యాలయం కోసం ప్రయత్నం చేసినా బాగుంటుందని స్థానిక ప్రజలు తెలిపారు. శనివారం 7 ,8 ,11 వార్డులు ఎమ్మెల్సీ ఎన్నికల వెరిఫికేషన్ నిమిత్తం వచ్చిన మున్సిపల్ సిబ్బంది, టిడిపి నాయకులకు కూర్చోవడానికి కనీసం కుర్చీలు లేకపోవడం త్రాగునీరు వంటి కూడా లేకుండా ఇబ్బందులు పడ్డారు.



విరిగిన తలుపు

భవనం లోపల పెరిగిన పిచ్చిమొక్కలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - జి.కొండూరు : టుంబ కలహాలతో పురుగుమందు తాగి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం నాగల గ్రామానికి చెందిన రావూరి మధుబాబు (37)తో ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం చిన్న నందిగామ గ్రామానికి చెందిన రాజగిరి రమణకు 17 సంవత్సరాల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. మధుబాబు కూలి పనులు చేసుకుంటూ చెడు వ్యసనాలకు బానిసై భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో భార్య పిల్లలతో సహా నందిగామలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు వచ్చి ఉంటుంది. ఈ క్రమంలో భార్యకు నచ్చచెప్పి తీసుకువెళ్లేందుకు వచ్చిన మధుబాబు శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో తాను తెచ్చుకున్న పురుగుమందు కుటుంబ సభ్యులు చూస్తుండగానే తాగాడు. తక్షణమే కుటుంబ సభ్యులు మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో మధుబాబు చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన బావమరిది రాజగిరి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు జి.కొండూరు ఎస్ఐ కె.సతీష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : విష్ణు

విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని వైసిపి సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో ఆదివారం యూనియన్ నాయకులు మల్లాది విష్ణుని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2005 లో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన 108 ఉచిత అంబులెన్స్ సర్వీసులు నేడు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు విస్తరించాయని అన్నారు. ప్రజలకు 24/7 అత్యవసర వైద్యసేవలు అందించటం, సకాలంలో ఆస్పత్రులకు తరలించి ప్రాణాలు కాపాడటంలో సిబ్బంది పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉద్యోగ సంఘాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

మంత్రి సబితను సస్పెండ్ చేయాలి'

ప్రజాశక్తి - తిరువూరు : శాసనమండలిలో మహిళలను అవమానపరిచేలా మాట్లాడిన మహిళా మంత్రి సబితను మంత్రి పదవి నుండి సస్పెండ్ చేయాలని రాష్ట్ర యాదవ కార్పొ రేషన్ మాజీ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మహిళల స్వయం సంవృద్ధికి బటన్ నొక్కి వేసిన డబ్బులతో మహిళలు గంజాయికి, ముందుకు బానిస అయ్యారని గౌరవం సభలో మంత్రి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. తక్షణమే మంత్రి ముక్కుని నెలకు రాసి రాష్ట్రంలో ఉన్న రెండు కోట్లమంది మహిళలకు క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు సరిగ్గా అమలు చేయటం చేతకాక మహిళలను అవమానించే విధంగా మాట్లాడటం బాధాకరమన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం నాకిష్టం'

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని ఠాగూర్ గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం అనే కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో జువాలజీ లెక్చరర్ జీ.వెంకటేష్ పుస్తకాలు చదవడం వలన. విజ్ఞానం, వికాసం పెరుగుతుందని తెలిపారు. అలాగే ప్రతి విద్యార్థి సబ్జెక్ట్పుస్తకాల తో పాటు జనరల్ పుస్తకాలు కూడా చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు, గ్రంథాలయ అధికారులు పాల్గొన్నారు.

వనసమారాధనలో విశ్వబ్రాహ్మణులు

విశ్వబ్రాహ్మణ వన సమారాధన

ప్రజాశక్తి - విస్సన్నపేట : విసన్నపేట మండల శ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం తృతీయ వార్షికోత్సవం, వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన విశ్వబ్రాహ్మణ సంఘ స్థలదాత తాతకుంట్ల మాజీ సర్పంచ్ ప్రముఖ కాంట్రాక్టర్ ఎన్‌టి.వెంకటేశ్వర రావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో కందుకూరి మోహన్, అక్షర సంస్థల అధినేత అరిగే ధనుంజయ్, తిరువూరు ప్రముఖులు రమేష్ మాస్టారు, సంఘ ముఖ్య సలహా దారు విన్నకోట శివశంకర్, మహిళా సంఘం అధ్యక్షురాలు నలనాగుల శారద పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - గంపలగూడెం : తమకు చదువునిచ్చిన పాఠశాలకు, ఆ పాఠశాలలో చదివే విద్యార్థులకు సహకారం అందించేందుకు ముందుకొస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986-87 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల్లో కొందరు ఆదివారం యాక్షన్ కమిటీగా ఏర్పడి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 150 మందికి గానూ 50 మంది వరకు సమకూరారు. పూర్వ విద్యార్థులంతా కుటుంబ సమేతంగా మార్చిలో అప్పటి తమ గురువులను సత్కరించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆరుగురితో కమిటీ ఏర్పడింది.

హలో శివ నేను రవిని.. నెంబర్ వన్ (గంజాయి కోడ్) ఉందా.. ఉంటే ఎక్కడకు రమ్మంటావు.. క్యాష్ రెడీగా ఉంది. మన సెంటర్‌కు వచ్చేసేయ్.. ఇది గంజాయి వ్యాపారులకు, కొనుగోలుదారులకు మధ్య సంభాషణ. యువకులు గంజాయికి బానిసలై రహస్యంగా కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. పోలీసులు దాడులు చేసిన.. ఆగడం లేదు. గంజాయి వ్యాపారులు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాల్లోకి వెళితే..

హలో... నెంబర్‌వన్ ఉందా...

- వివిధ కోడ్‌లతో రెచ్చిపోతున్న గంజాయి ముఠా
- ప్రత్యేక స్థావరాలు ఏర్పాటు చేసుకొని కార్యకలాపాలు
- భయాందోళనలో మహిళలు, ఉద్యోగులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పరిసర ప్రాంతాల్లో గంజాయి ముఠా రెచ్చిపోతున్నారు. చెన్నై, కోల్ కత్తా జాతీయ రహదారిలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, అల్లాపురం, వెంకట నరసింహాపురం కూడలిని అడ్డాగా మార్చుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారు. ప్రభుత్వం మారిన కొంతకాలం గుట్టుచప్పుడు కాకుండా ఉన్న వీరు తాజాగా ఎటువంటి అనుమానం రాకుండా గన్నవరం స్టేషన్ పరిధిలో తమకు ప్రత్యేక స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న విమానాశ్రయ పరిసరాల్లో నిత్యం మాటు వేస్తూ యదేచ్ఛగా గంజా యిని నగరానికి చేరవేస్తున్నారు. చీకటి పడిందంటే చాలు సమీప కాలనీల్లో నడవాలంటేనే ఇబ్బందిగా ఉంటుందని స్థానిక మహిళలు ఆవేదన చెందుతున్నారు. ద్విచక్ర వాహనాలపై పలువురు యువత చక్కర్లు కొడుతూ కనిపిస్తు న్నారని వాపోతున్నారు. స్థానికంగా ఉన్న కాలనీల్లోని యువత పూర్తిగా మత్తుకు బానిస కావడంతో తల్లిదం డ్రులు వేదన అంతా ఇంతా కాదని చెబుతున్నారు. గతంలో ఎంచుకున్న అడ్డ దారులను పోలీసులు బట్ట బయలు చేయడంతో ఎటువంటి అనుమానం రాకుండా, ఖాకీలకు చిక్కకుండా ప్రజా రవాణా, అద్దె కార్లలో గంజాయిని నగరానికి తరలిస్తున్నారు.

భయాందోళనలో ఉద్యోగులు..

విమానాశ్రయం, మేధ టవర్స్, హెచ్సీఎల్ ఇతర ప్రైవేట్ సంస్థల్లో పని చేసే యువతీ, యువకులు విమానాశ్రయానికి ఆనుకొని ఉన్న ఓ ప్రైవేట్ వసతిగహంలో సుమారు 30 మంది నివసిస్తున్నారు. గంజాయి బ్యాచ్ ఆగడాలతో రాత్రివేళ రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పరిసరాలు మరింత భయానకంగా ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అంటూ బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని ఆవేదన చెందుతున్నారు. నెలకు రూ.పది వేలు ఖర్చు చేసి ఉంటున్నా కనీస రక్షణ కొరవడిందని భయాందోళనకు గురవుతున్నారు.

ప్రత్యేక నిఘా పెడితే మేలు...

గత కొంతకాలంగా గన్నవరం స్టేషన్ పరిధిలో ఒక్క గంజాయి కేసు కూడా నమోదు కాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ లేకపోవడం, కేవలం వచ్చిన ఫిర్యాదులకు మాత్రమే అధికారులు స్పందించడంతో ఎక్కడ ఏమి జరిగినా పోలీసు లకు తెలియని దుస్థితి నెలకొంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన విమానాశ్రయం పరిసరాల్లో ప్రత్యేక నిఘాతో పరిస్థితిని చక్కదిద్దా అని సామాజిక వేత్తలు, ప్రజలు కోరుతున్నారు.

ఫీజుల విషయంలో విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలకు సంబంధించి ఏ విద్యార్థికి హాల్ టిక్కెట్లు నిరాకరించకూడదని లేదా తరగతులు, ప్రాక్టికల్స్ మొదలైన వాటికి దూరంగా ఉంచకూడదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలకు సంబంధించి కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా నిరాకరిస్తున్నాయని, తరగతులు, ప్రాక్టికల్స్‌కు హాజరుకాకుండా అడ్డుకుంటున్నారని జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నేరుగా కాలేజీలకు విడుదలవుతుందని, అదేవిధంగా గత బకాయిలు కూడా క్రమంగా విడుదల చేస్తుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని కలెక్టర్ తెలిపారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలకు సంబంధించి ఏ విద్యార్థికి హాల్ టిక్కెట్లు నిరాకరించకూడదని లేదా తరగతులు, ప్రాక్టికల్స్ మొదలైన వాటికి దూరంగా ఉండకూడదని పేర్కొంటూ సంబంధిత అధికారుల అధికార పరిధిలోని అన్ని కళాశాలలకు కఠినమైన ఆదేశాలు జారీ చేయాలని మచిలీపట్నంలో కష్ణ విశ్వవిద్యాలయం, కాకినాడ జేఎన్టీయూ విశ్వవిద్యాలయం, ఆర్జెడి కాలేజ్ ఎడ్యుకేషన్ రాజమండ్రి, కష్ణ జిల్లా డీఈవో, కష్ణాజిల్లా జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారులందరినీ ఆదేశిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామనిజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చున న్నారు. ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఎన్‌టిఆర్ సినీ రంగ వజ్రోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు సినీ రంగ ప్రవేశం వజ్రోత్సవ వేడుకలు అవనిగడ్డలోని రాజీవ్ సెంటర్లో ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండ లి వెంకట్ రామ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి ఎన్టీఆర్ నటించిన చిత్రాల గురించి తెలుగు ప్రజల ఆత్మ గౌరవం గురించి ఆయన చేసిన పోరాటాలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, తుంగలగిరి దాసినేని శ్రీనివాసరావు, లుక్క శ్రీనివాసరావు, కటికల బాలాజీ , కుక్కిలిగడ్డ నాగరాజు, మెరుగు సోమిరెడ్డి, కొట్టే విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

మంత్రి కొల్లుకు 104 ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కృష్ణాజిల్లా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ను కలిసి వినతి పత్రం అందజేశారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి కొల్లు రవీంద్ర ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వానికి తెలియపరుస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు అద్దం. మురళీకష్ణ, సంఘ నాయకులు వినయ్ , బత్తుల రవీంద్ర ,గుంటూరు నాంచారయ్య, కొల్లా రామ్మోహన్ ,ఎర్ర శివ గారు, బత్తుల సతీష్ బాబు, దాసరి పోతురాజు, రాజీవ్ సుబ్రహ్మణ్యం, శ్యాంబాబు , పునపు రెడ్డి సురేష్ పాల్గొన్నారు.

మంత్రికి వినతిపత్రం అందిస్తున్న 104 ఉద్యోగులు

రెడ్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఆదివారం సుందరయ్య రెడ్ వాలంటీర్లు శ్రమదానం చేశారు. రోడ్డుకి ఇరువైపులా దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. కాగితాలను, ప్లాస్టిక్ వస్తువులను ఏరి శుభ్రం చేశారు. మురుగు కాలువలను క్లీన్ చేశారు. రిటైర్డ్ అధ్యాపకులు గన్నె వెంకట్రావు, డాక్టర్ మద్దుకూరి విజయ్ కుమార్, రెడ్ వాలంటీర్స్ కన్వీనర్ నాగ బ్రహ్మాచారి, సభ్యులు పాల్గొన్నారు.

యలవర్తి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - గుడివాడ : ఎన్‌టిఆర్ స్టేడియం కమిటి వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం రాజేంద్రనగర్‌లోని యలవర్తి స్వగహంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులతో కలసి అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను యలవర్తి శ్రీనివాసరావు కట్ చేసి నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా రావి మాట్లాడుతూ గుడివాడ అభివద్ధి కోసం 18 ఏళ్ల కుర్రాడిలా యలవర్తి నిత్యం కష్టపడతారన్నారు. విశ్వభారతి విద్యాసంస్థల ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, టిడిపి నాయకులు అల్లూరి వేణు, వసంతవాడ దుర్గారావు, నెరుసు చింతయ్య, వడ్డాది నాగరాజు, పొట్లూరి కష్ణారావు, మిక్కిలినేని రమేష్, సయ్యద్ జబీన్, రెడ్డి షణ్ముఖ, రామిదేని వేణు, కంచర్ల సుధాకర్, టిడిపి, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, పలు స్వచ్ఛంద సభ్యులు పాల్గొన్నారు.



యలవర్తిని సత్కరిస్తున్న రావి వెంకటేశ్వరరావు

244 మంది పోలీసు సిబ్బంది బదిలీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో 244 మంది పోలీసు సిబ్బందిని బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలో ఒకే చోట పనిచేస్తూ ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న పోలీస్ సిబ్బందికి ఆప్షన్స్ ఆధారంగా స్థానచలానం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు సబ్ డివిజన్ల పరిధిలోని 244 మంది సిబ్బందికి (16 ఏఎస్ఐలకు, 74 హెడ్ కానిస్టేబుల్ లకు, 154 కానిస్టేబుల్ లకు) పూర్తి పారదర్శకంగా వారు కోరుకున్న చోటుకే బదిలీలు నిర్వహించారు. బదిలీ ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహించి, ఆప్షన్స్ ఆధారంగా ఖాళీలను బట్టి వారు కోరుకున్న పోలీస్ స్టేషన్ కు పోస్టింగ్స్ ఇచ్చినట్లు ఎస్పీ కార్యాలయ అధికారులు తెలిపారు.

కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కృష్ణాజిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం సంధర్భంగా శ్రీ అమ్మవారిని సుమారు 7 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకొన్నారు. దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు త్రాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు ఏ విధమైన అసౌకర్యములు కలగకుండా దర్శనం చేసుకునేందుకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గుడ్లవల్లేరు ఎస్సై సత్యనారాయణ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఓటు నమోదు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామంలో ఓటరు నమోదుకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం అధికా రులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శివకుమార్, వీఆర్వో ప్రకాష్, పోలింగ్ బూత్ ఇన్చార్జులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

26న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జి.కొండూరు : 26న ఆర్‌డిఒ కేంద్రాల్లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఎపిఇ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. జి.కొండూరులో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి పగడాల వీరాంజినేయులు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం యన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ పన్నులు కట్టేది ప్రజలు - లాభాలు కాంట్రాక్టర్లకు అన్నారు. బ్యాంకులలో డిపాజిట్లు సామాన్య, మధ్యతరగతి ప్రజలవి- భారీగా రుణాలు, రుణమాఫీలు కార్పొరేట్లకు అని విమర్శించారు. ఈ విధమైన తప్పుడు విధానాలను మార్చుకోవలసిన ఆవశ్యకత గురించి కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించేందుకు 26న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పి.సాంబశివరావు, సిఐటియు జి.కొండూరు మండల కార్యదర్శి కొంకా.బాలకృష్ణ పాల్గొన్నారు. **వత్సవాయి :** 26న ఆర్‌డిఒ కేంద్రాల్లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వత్సవాయి మండలం మంగొల్లులో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బి.రాము మాట్లాడారు. సిఐటియు మండల కమిటీ సభ్యులు కె.పటేల్, పుల్లయ్య, అప్పారావు మున్నా, నాగయ్య తదితరులు పాల్గొన్నారు. **గంపలగూడెం :** ఈ నెల 26న సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైతాంగ, కార్మిక సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా ధర్నా జరుగుతున్నట్లు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మద్దిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కార్మిక సంఘ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తిరువూరు ఆర్‌డిఒ కార్యాలయంలో జరుగుతున్న ధర్నాను కార్మికులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు. జిల్లా రైతు సంఘం నాయకులు గువ్వల సీతారామిరెడ్డి, సిఐటియు నాయకులు మీసాల గోపి, మీసాల గోపాలరావు, మీసాల వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

జి.కొండూరులో కరపత్రాలు పంచుతున్న నాయకులు

వత్సవాయిలో...



కోడిపందేల నిర్వాహకుల అరెస్ట్

ప్రజాశక్తి - మైలవరం : కోడిపందేలు వేస్తున్న 8 మందిని ఆదివారం అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ దాడి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని చంద్రగూడెం గ్రామంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి నుండి రూ.3,570 లను, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - విస్సన్నపేట : రాబోవు ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ క్యాంపెనింగ్ డే ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం విస్సన్నపేట మండలం పుట్రేల పోలింగ్ స్టేషన్ నెం 147, 148, కొండపర్వ గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెం 189,190, 191, విస్సన్నపేట టౌన్‌లో గల 175,176,182, 187, 188 పోలింగ్ స్టేషన్లను మండల తహశీల్దార్ కె.లక్ష్మీ కళ్యాణి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఒలు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వారికి ఎన్నికల గురించి తగు సూచనలిచ్చారు.

విస్సన్నపేటలో కొలికపూడి పర్యటన

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండలం జానలగడ్డ గ్రామంలో ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాస రావు రైతులతో ముచ్చటించారు. కూలీలు తెచ్చుకున్న భోజనం వారితో కలిసి తింటూ వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. అనంతరం విస్సన్నపేట మండలం స్థానిక పట్టణ మాదిగ ఉద్యోగుల సంఘం నిర్వహించిన వనసమారాధనలో ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగులందరూ ఆయనను శాలువాతో సత్కరించారు.

కొలికపూడిని సన్మానిస్తున్న దృశ్యం

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిధిలోని మద్దులపర్వ గ్రామంలో టిడిపి నాయకులు పాలంకి మోహన మురళిరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళిరెడ్డి మాట్లాడారు. రంగాపురం పంచాయతీ రెడ్డి కుంట గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం చూస్తుందని అన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, అశోక్ రెడ్డి, రాజు పాల్గొన్నారు.

సభ్యత్వాలు నమోదు చేస్తున్న దృశ్యం

పేదలకు వస్త్రదానం

ప్రజాశక్తి - గంపలగూడెం : సత్య సాయి 99వ జన్మదిన పురస్కరించుకొని పేదలకు వస్త్రాలు పంపిణీ చేసినట్లు గంపలగూడెం రిటైర్డ్ తహశీల్దార్ టి.రామచంద్ర రాజు తెలిపారు. ఈ సందర్భంగా పేదలు, వితంతువులు, వికలాంగులకు వస్త్రాలు అందజేసినట్లు తెలిపారు. ఇటీవల మతి చెందిన తిరువూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగరాజుకు నివాళులర్పించారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని పెనుగంచిప్రోలు గ్రామంలో మండల పరిషత్ కార్యాలయంలో రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని అమ్ముకోవాలని ఆర్‌డో బాలకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విధి విధానాలను వివరించారు. పౌర సరఫరాల శాఖ మేనేజర్ ఎం.జయప్రద, పిడిఒ జి.శ్రీను, ఎఒ రామ సుబ్బారెడ్డి, డిటికె భాస్కర్, విఆర్‌ఒలు, గ్రామ సహాయకులు, పిఎసిఎస్, సిఇఒలు పాల్గొన్నారు.

పురుగుమందు పిచికారీపై అవగాహన

ప్రజాశక్తి - వత్సవాయి :
మండలంలోని అనిగండ్లపాడులో గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల పర్యవేక్షణలో భాగంగా గ్రామీణా పని అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో గ్లౌవ్స్, ఫేస్ మాస్క్, మందు ఒంటికి తగలకుండా కవర్లు వంటివి వాడాలని రైతులకు తెలిపారు. పురుగు మందులు కలిపే సమయంలో ఎక్కువ మోతాదులో మందు వేయకూడదని సూచించారు. విద్యార్థులు హర్షవర్ధన్ రెడ్డి, ఖలీల్, ఆంజనేయులు, దుర్గాప్రసాద్, బాలకోటి రెడ్డి, రైతులు పి.రామకృష్ణ, పి.వాసు, జి.జనార్ధన్, రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థులు

సహకార, నీటి సంఘాల ఎన్నికల్లో జనసేన పోటీ

ప్రజాశక్తి - మైలవరం : త్వరలో జరగనున్న నీటి సంఘాల, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికల్లో జనసేన ప్రాతినిధ్యం ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గ ఇన్చార్జి అక్కల గాంధీ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో పాల్గొనేలా నాయకులందరూ సమాయత్తం కావాలని సూచించారు. నీటి సంఘాలు, సహకార సంఘాల ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించేలా నాయకులు చూడాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో జనసేనకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులను కోరతామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు శీలం బ్రహ్మయ్య, ఉదయ్, మురళీకృష్ణ, ఈశ్వర్, రామారావు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు సూర్యా రెస్టారెంట్ సమీపంలో గల పరిపూర్ణ సేవా సంస్థలో ఉంటున్న 30 మంది చిన్నారులకు రగ్గులు లక్ష్మీపురం సర్పంచ్ గొల్లమందల శ్రీనివాసరావు ఆదివారం అందజేశారు. చెన్నైలో ఉంటున్న తిరువూరు ప్రాంతానికి చెందిన కందుల జయ చలికాలం దృష్టిలో ఉంచుకుని చిన్నారులకు రగ్గులు వితరణ చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. పరిపూర్ణ నిర్వాహకులు సిరికొండ నాగేశ్వరరావు, వరలక్ష్మి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ సౌమ్యకు సత్కారం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య ఇటీవల రాష్ట్ర ప్రభుత్వవిప్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నందిగామలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో ఆమెను జర్నలిస్టులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పి.మీరాహుస్సేన్ ఖాన్ ది న్యూ ఇండియన్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు అసోసియేషన్ ఆఫ్ ప్రింట్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు, పల్లెక్రాంతి దినపత్రిక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్యూరో, జర్నలిస్టు సంఘ నాయకులు పంగులూరి వెంకట్రావు చౌదరి, చంద్రశేఖర్, ప్రముఖ ఎడిటర్ సిఎ రామానుజ, తదితరులు కలిశారు.
ఈ సందర్భంగా సౌమ్య తో జర్నలిస్టు సంఘ జాతీయ నాయకులు పి.మీరాహుస్సేన్ ఖాన్ మాట్లాడుతూ జర్నలిస్టులకు సంబంధించిన పలు సమస్యలు ఆమె దష్టికి తీసుకు వెళ్లారు. నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో సమాచార శాఖ డివిజనల్ పి ఆర్ ఓ కార్యాలయం కేంద్రం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి విప్ సానుకులంగా స్పందించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని డివిజనల్ పి ఆర్ఓ కార్యాలయం కేంద్రం ఏర్పాటుకు తక్షణమే విధివిధానాలు తెలుసుకోని జర్నలిస్టులకు మేలు చేస్తామని అన్నారు. ప్రతి ఒక్క జర్నలిస్టుకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని విప్ సౌమ్య తెలిపారు. జర్నలిస్టులు వృత్తి పరంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు.

కొడాలి నాని, వంశీలపై బుద్ధా వెంకన్న ఫైర్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆలిండియా పికిలిపందల సంఘానికి కొడాలి నాని, వల్లభనేని వంశీలు అధ్యక్ష కార్యదర్శులని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ఫైర్ అయ్యారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుద్దా వెంకన్న వైసిపి నాయకులపై విమర్శలు గుప్పించారు. వైసిపి పాలనలో నాని, వంశీలు నోటికొచ్చినట్లు మాట్లాడారన్నారు. ఇప్పుడు ఎక్కడికి పారిపోయారని, అసలు కొడాలి నాని, వంశీ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. వైసిపి పాలనలో ఇష్టానుసారంగా మాట్లాడిన వారంతా వారంతా జైలుకు వెళ్లాల్సిందేనని అని అన్నారు. కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), తెదేపా సీనియర్ నాయకులు కొట్టేటిహుమంతరావు ఉన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - వత్సవాయి : సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వత్సవాయి ఎస్ఐ ఉమామహేశ్వరరావు సూచించారు. మండలంలోని సైబర్ నేరాలపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని మోసపూరిత యాప్‌లు వస్తున్నాయన్నారు. వాటికి ఒటిపిలు బ్యాంకు వివరాలు చెప్పాలని కోరుతూ వచ్చే ఫోన్లకు స్పందించకూడదని తెలిపారు. గ్రామాల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఎల్‌హెచ్ఎం యాప్‌లో నమోదు చేసుకుంటే పోలీసులు ఇంటి వద్దకు వచ్చి సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. అనంతరం సైబర్ నేరాలపై మైకు ప్రచారాన్ని ప్రారంభించారు.

స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఉమామహేశ్వరావు

నిందితులను శిక్షించాలని ఆందోళన

పెనమలూరు : మూడు రోజుల క్రితం విశాఖపట్నంలో లా చదివే విద్యార్థినిని తోటి విద్యార్థులు అత్యాచారం చేయడం దుర్మార్గమని వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ పెనమలూరు మండలం ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పోరంకి కార్మిక నగర్‌లో ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పెనమలూరు మండలం ఐద్వా మహిళా సంఘం కార్యదర్శి పుసులూరిపాత లక్ష్మీ మాట్లాడుతూ మహిళల మీద అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతు న్నాయని, విశాఖపట్నంలో లా చదివే విద్యార్థిని తోటి నలుగురు విద్యార్థులు మాయమాటలు చెప్పి అత్యాచారం చేయడం దుర్మార్గమని వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పెనమలూరు మండలం సిఐటియు కార్యదర్శి. ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ గంజాయి మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారని అనేక సందర్భాలలో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రస్తుతం జరుగుతున్న అత్యాచారాలపై అరికట్టాలన్నారు. ఆడపిల్లల తల్లిదండ్రులు ఎప్పుడు ఏం జరుగుతుందని ఆందోళనలో ఉన్నారని, తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షిస్తేనే మరో వ్యక్తి ఇలాంటి తప్పులు చేయకుండా భయపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పెనమలూరు మండలం కార్యదర్శి. పి.లక్ష్మీనారాయణ, డివైఎఫ్ఐ నాయకులు సోమశేఖర్, దుర్గాప్రసాద్, కష్ణ, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు సిహెచ్ భవాని,రవణమ్మ, తరిగొప్ప లావణ్య దుర్గ భవాని, వరలక్ష్మి, రమాదేవి, ప్రజానాట్యమండలి నాయకురాలు ఈశ్వరి, డివైఎఫ్ఐ నాయకులు తరిగొప్పల దుర్గారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు

కూరగాయల వాహనానికి జెండా ఊపుతున్న తులసి మోహన్

శ్రీశైలం దేవస్థానానికి కూరగాయల తరలింపు

ప్రజాశక్తి-గన్నవరం : శ్రీశైల దేవస్థానానికి రూ. 1.50 లక్షల విలువైన కూరగాయలను గన్నవరం శివాలయం ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. శివాలయం వద్ద కూరగాయల వాహనానికి మాజీ సర్పంచ్ గూడపాటి తులసి మోహన్ పచ్చ జెండా ఊపారు. కార్తీక మాసంలో శ్రీశైల ఆలయంలో జరిగే అన్నదాన కార్యక్రమానికి కూరగాయాలను పంపడం అదష్టంగా భావిస్తున్నట్లు శివాలయ కమిటీ తెలిపింది. గన్నవరం ప్రజల సహకారంతో నాలుగు టన్నుల కూరగాయలను సమీకరించామని పేర్కొంది. ఈ కార్యక్రమంలో పెద్దలు నెక్కలపూడి ఈశ్వర రావు, మండవ వెంకట ప్రభాకరరావు, జాస్తి శ్రీధరరావు, టిఎస్ఆర్ కె ప్రసాద్, కొణసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు

యోగాతో శారీరక, మానసికోల్లాసం

ప్రజాశక్తి- ఉయ్యూరు : భారతీయ ప్రాచీన వారస్వత విజ్ఞాన సంపద 'యోగా' కేవలం వ్యాయామమే కాక, ఉత్తమ జీవన విధానమని ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం సాత్విక్ యోగ చారిటబుల్ ట్రస్ట్ సర్వసభ్య సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ యోగ నిత్య సాధన వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభించడంతో పాటు క్రమశిక్షణ జీవితం అలవడు తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మండవ జయదేవ్, విశిష్ట యోగ గురువు, సీనియర్ పాత్రికేయులు దావులూరి రాధాకష్ణ మూర్తి, యోగ ట్రస్ట్ కార్యదర్శి జంపాన శ్రీనివాస్ గౌడ్ యోగా ట్రస్ట్ వ్యవస్థాపకులు, యోగ గురూజీ జి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలో మంజూరైన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను వేగ వంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ డీఈఈ పగడాల సురేష్ బాబు ఉపాధి హామీ పథకం ఏపీఎం రవికుమా రులతో పల్లె పండుగ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా పంచాయ తీరాజ్ అధికారులు పనులు అభివద్ధిపై ఎమ్మెల్యేకు వివరించారు పల్లె పండుగ నిధులతో 43.95 కిలోమీటర్ల పొడవైన 447 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టగా ఇప్పటికీ 77 కోట్ల రూపాయల నిర్మాణం పూర్తయినట్లు ఎమ్మెల్యేకి తెలిపారు . జీఎస్పీ దశలో 177రోడ్లు సిసి ప్రోగ్రెస్ దశలో 9 రోడ్లు ఉన్నట్లు తెలిపారు. మరో 50 రోడ్ల పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 134 సీసీ రోడ్లు గ్రౌండ్ చేయాల్సి ఉన్నట్లు డిఈ వివరించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెలాఖరులోపు అన్ని రోడ్ల నిర్మాణ పనులను మొదలు పెట్టాలని సూచించారు. ఈ నెలాఖరులోపు పనులు మొదలు పెట్టని రహదారులను రద్దుచేసి వేరే గ్రామాలకు కేటాయించాలని బుద్ధ ప్రసాద్ అధికారులకు ఆదేశించారు.

శరవేగంగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి- నందిగామ : శరవేగంగా నందిగామ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నందిగామ శివారులోని వై జంక్షన్ వద్ద జాతీయ రహదారికి అనుబంధంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ఫ్లైఓవర్ పూర్తవ్వటం వల్ల బైపాస్ నుంచి వచ్చే వాహనదారులు వేగంగా విజయవాడ మార్గం వైపు వెళ్లేందుకు అవకాశం ఉంది. ఫ్లై ఓవర్ అసంపూర్తిగా ఉండటం వల్ల వై జంక్షన్ వద్ద ఇప్పటికే పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో క్లాప్ ఆటో కార్మికులు ఆదివారం సింగినగర్ ఎక్సెల్ చెత్త ఫ్యాక్టరీ వద్ద అర్ధ నగ్నంగా ప్రదర్శన చేస్తూ పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. నగర వ్యాప్తంగా ఉన్న క్లాప్ ఆటో కార్మికులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. పరిష్కరించాలి క్లాప్ ఆటో కార్మికుల సమస్యలను, ఇవ్వాలి పెండింగ్ వేతనాలు, క్లాప్ ఆటో కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని, గుర్తింపుకార్డులు మంజూరు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ డబ్బులు జమ చేయాలని కోరుతూ కార్మికులు చేసిన నినాదాలు హోరెత్తాయి. ఈ ధర్నా కార్యక్రమానుద్దేశించి మున్సిపల్ యూనియన్ నగర కోశాధికారి డి.స్టీఫెన్ బాబు,ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్,క్లాప్ ఆటో యూనియన్ కార్యదర్శి శివ మాట్లాడుతూ క్లాప్ ఆటో కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్త సమ్మెకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. వెంటనే పెండింగ్లో ఉన్న రెండు నెలల వేతన బకాయి చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కూడా వెంటనే జోక్యం చేసుకోవాలని అన్నారు. క్లాప్ ఆటో యూనియన్ బాధ్యులు రాజేష్, రామరాజు ,రుద్ర శ్రీనివాస్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మడక ప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

క్రీడారత్న జాతీయ పురస్కారం అందజేత

ప్రజాశక్తి-గుడివాడ : క్రీడారంగంలో విశేష సేవలు అందించిన ఎస్‌పిఎస్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మడక ప్రసాద్‌కు క్రీడా రత్న జాతీయ పురస్కారాన్ని అందజేశారు. ఆదివారం ఒంగోలులోని కళామిత్ర మండలిచే మడక ప్రసాద్‌కు క్రీడా రత్న జాతీయ పురస్కారం అందించారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, కళామిత్ర మండలి అధ్యక్షులు నూనె అంకమ్మరావు, ప్రముఖ సాహితీవేత్త శివారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ఖోఖో సంఘ కార్యదర్శి సీతారాంరెడ్డిల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్బంగా క్రీడా రత్న పురస్కారం అందుకున్న మడక ప్రసాద్‌కు, కష్ణాజిల్లా ఖో ఖో సంఘ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అధ్యక్షులు మద్దినేని సత్యప్రసాద్, గుడివాడ డివిజన్ ఉప విద్య శాఖ అధికారిని పద్మారాణి, కష్ణాజిల్లా డిసిబి సెక్రెటరీ షేక్ జానీసాహెబ్, ఎస్‌పిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి, పాఠశాల సిబ్బంది అభినందలు తెలిపారు.

మత్స్యకారులకు గృహ నిర్మాణ పథకం అమలు చేయాలి

ప్రజాశక్తి-నాగాయలంక : రాష్ట్రంలోని మత్స్యకారులకు ప్రత్యేక గహ నిర్మాణ పథకాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ఆదివారం నాగాయలంకలోని మత్స్య భవనం వద్ద విలేఖర్లతో మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంత గ్రామాలలో తరచు సంభవించే తుఫాన్, ఉప్పెనలవంటి ప్రకతి ఉప దవాలను తట్టుకుని నిలబడి ఉండేలా పక్కా గహాలను నిర్మించాలన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గహ నిర్మాణానికి కేటాయించే రూ నాలుగు లక్షల రూపాయలు తీర ప్రాంత గ్రామాలలో మత్స్యకారులు నిర్మించుకునే పక్కా గహాలకు సరిపోవన్నారు. గహనిర్మాణానికి అవసరమైన ఇసుక, ఇటుక, ఇనుము రవాణ ఖర్చులే అదనంగా రూ 2లక్షలు అవుతాయన్నారు. అందుకు అనుగుణంగా నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కర్రి కష్ణమూర్తి, నాగిడి తాతారావు, లంకే శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

గౌతమ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : దేశంలో పెచ్చు మీరిపోతున్న మతోన్మాద ఫాసిస్ట్ శక్తులను ఓడిస్తేనే పీడిత ప్రజలకు మేలు జరుగుతుందని విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరసవల్లి కష్ణ తెలిపారు. ఆదివారం కోడూరు మండలం నారేపాలెం గ్రామంలో గౌతమ్ 18వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కష్ణ మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ఎన్డీఏ కూటమి ఆదివాసులపై యుద్ధాన్ని కొనసాగిస్తుందని, దండకరణ్యంలో నిరంతరం దాడులు చేస్తూ ఆదివాసులను హత్యలు చేస్తున్నారన్నారు. దీనితో భయభ్రాంతులను సష్టించి వారిని అడవి నుండి తరిమేసి అక్కడ ఉన్న ఖనిజ సంపదను పెట్టుబడి దారులకు దోచి పెట్టాలనే సంకల్పంతోనే ఈ దాడులు చేస్తు న్నారని విమర్శించారు. పదుల సంఖ్యలో ఎన్కౌంటర్లు చేస్తూ ఇప్పటివరకు 226 మందిని చంపారన్నారు. రాఘ వేంద్రరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు పరుచూరి జనార్ధన్, తమ్మ రత్తయ్య పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హబ్‌గా బందర్‌ను తీర్చిదిద్దుతాం : మంత్రి

క్రికెట్ ఆడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా మారుస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం నోబుల్ కాలేజీ మైదానంలో నిర్వహిస్తున్న ఎన్‌సిసి క్రికెట్ టోర్నీకి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రీడకారులతో కాసేపు ముచ్చటించారు. బ్యాటింగ్ చేసి అలరిం చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మచిలీపట్నం యువత అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షిం చారు. రాబోయే రోజుల్లో మచిలీపట్నంలో మరిన్ని వసతులతో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిపారు. బీసీసీఐ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేడియం నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతానికి అందుబాటులో ఉన్న 11 ఎకరాల స్థలంలో అథ్లెటిక్ ట్రాక్, ఫుట్బాల్ కోర్ట్, హాకీ కోర్టు, అవకాశం మేరకు స్విమ్మింగ్ పూల్ కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని వివరించారు. భవిష్యత్తులో మచిలీపట్నం నుంచి ప్రతి క్రీడలో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఉండాలన్నది తన అభిలాష అన్నారు. నాల్గో రోజు జిఈసి 11, సూపర్ ఫైటర్స్ మధ్య మొదటి మ్యాచ్ జరగగా సూపర్ ఫైటర్స్ మూడు వికెట్లకు 85 పరుగులు చేశారు. రెండో ఇన్నింగ్స్ వచ్చిన జిఈసి 11 టీమ్ మూడు పరుగుల తేడాతో ఓటమి పాలైంది. రెండో మ్యాచ్ సింహాచలం, ఆర్అండ్ఎల్ ఇంజనీరింగ్ మధ్య మ్యాచ్ జరిగింది. సింహాచలం టీం 9 వికెట్లు కోల్పోయి 57 పరుగులు చేయగా ఆర్అండ్ఎల్ ఇంజనీరింగ్ 51 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది.

26న తిరువూరులో జాబ్‌మేళా

ప్రజాశక్తి - తిరువూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, సీడ్ యాప్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు ఈనెల 26న తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఎం.సుశీలరావు తెలిపారు. ఈజాబ్ మేళాకు యాక్సిస్ బ్యాంక్ (ఖాళీలు 80, జీతం రూ.18వేలు నుంచి 20వేల వరకు) 28 సంవత్సరాల వయసు కలిగి డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. మెడ్ ప్లస్ కంపెనీలో 100 ఖాళీలకు 18 నుండి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారిని ఎంపిక చేస్తారని (జీతం రూ. 12వేలు నుంచి 20వేల వరకు), ఎస్.ఎస్.సి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎం ఫార్మసి, బిఫార్మసి చదివి పిసిఐ సర్టిఫికేట్‌తో హాజరు కావాలని చెప్పారు. సుధీర్ టింబర్స్ ప్రైవేటు లిమిటెడ్ లో 20 ఖాళీలకు ఎంపిక చేస్తారని (జీతం రూ.15వేల నుంచి 25వేల వరకు), ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 40 సంవత్సరాల వయస్సు లోపు కలిగి ఆసక్తి గల అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరు కావాలని అధికారులు నిరుద్యోగులకు విజ్ఞప్తి చేశారు.

రేపు రుణాలపై ఎస్‌బిఐ సమావేశం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలోని క్లాత్ మర్చంట్ అసోసియేషన్ హాల్లో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు నందిగామ స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్, టౌన్ బ్రాంచ్, రాక్ ఆధ్వర్యంలో రుణాలపై సమావేశం నిర్వహించనున్నట్లు ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ వైసిహెచ్.కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో బిజినెస్ లోన్స్, ముద్రలోన్స్, పెన్షనర్లకు పెన్షన్ లోన్స్, హౌసింగ్, కార్ లోన్స్ మంజూరు చేసేందుకు ఈ సమావేశంలో పాల్గొని తమ పేర్లను నమోదు చేయించుకోవాలని, ఈ అవకాశాన్ని వ్యాపారులు, ఉద్యోగస్తులు వినియోగించుకోవాలని ఎస్‌బిఐ మేనేజర్ కృష్ణయ్య తెలిపారు. వివరాలకు 9502613393 నెంబర్‌ని సంప్రదించొచ్చని తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఇగ్నో విద్య

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందచేస్తుందని ఇగ్నో విజయవాడ కొత్తపేటలో గల ప్రాంతీయ కార్యాలయం సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ డి.ఆర్.శర్మ చెప్పారు. ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నూతనంగా అడ్మిషన్‌లు పొందుతున్న విద్యార్థులకు ఇండక్షన్ మీటింగ్ (కోర్సు పరిచయ కార్యక్రమం) ఆదివారం పాతబస్తీలోనే కెబిఎన్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శర్మ మాట్లాడుతూ ఇగ్నో సర్టిఫికేట్ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడుకుని ఉన్నదని ప్రపంచవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులు ఇగ్నో నిర్వహించే దూరవిద్య కోర్సులు ద్వారా లబ్ధి పొందుతున్నారని వివరించారు. ఆరు మాసాలకు ఒకసారి అడ్మిషన్స్ జరుగుతుంటాయని ఆన్లైన్లో ఎవరైనా అప్లై చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు అయన సమాధానాలిచ్చారు. కెబిఎన్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్.రమేష్ మాట్లాడుతూ ఇగ్నో ద్వారా సుమారు 300కు పైగా ప్రోగ్రాములు చేరువలో ఉన్నాయని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రసాద్ బాబు, కెబిఎన్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరావు, కెబిఎన్ కాలేజీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాసరావు, ఇగ్నో కో-ఆర్డినేటర్ ఎన్.సాంబశివరావు, ఇగ్నో అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డి. పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రీజినల్ డైరెక్టర్ డాక్టర్ డి.ఆర్.శర్మ



వేడుకల్లో వైద్య బృందం

నెలలు నిండని శిశువులకు 'నోరి'లో ఆధునిక వైద్యం

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : నెలలు నిండకుండా పుట్టిన శిశువుల విషయంలో తల్లిదండ్రులు ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు సూచించారు. ప్రస్తుత ఆధునిక వైద్యంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని సకాలంలో వైద్యుని సంప్రదిస్తే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. బందర్ రోడ్డులోని మేనర్ ఫుడ్ ప్లాజాలో నోరి హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ డే 2024 కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ డే వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా నోరి హాస్పిటల్స్ వైద్యులు నెలలు నిండకుండా పుట్టిన శిశువుల వైద్యం అందించడంలో విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. నెలలు నిండకుండా పుట్టిన శిశువుల విషయంలో తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతుంటారని చెప్పారు. నోరి హాస్పిటల్స్ వైద్యులు 750 గ్రాముల బరువుతో పుట్టిన శిశువుకు చక్కని వైద్యం అందించడంతో ప్రస్తుతం ఆ యువకుడు అన్ని రంగాల్లో ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. డాక్టర్ నోరి సూర్యనారాయణ మాట్లాడుతూ తమ హాస్పటల్లో అత్యాధునిక నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో నెలలు నిండకుండా పుట్టిన శిశువులకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. 450 గ్రాములు నుండి 700 గ్రాముల బరువులో పుట్టిన చాలామంది శిశువులకు అత్యాధునిక వైద్యం అందించడంలో విజయవంతం అయినట్లు వివరించారు. నియోటలాజిస్ట్ డాక్టర్స్ నరేంద్ర బాబు, సుభాష్ అరుణ్, అనిత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నియోనటాలజీ వైద్య సేవల వివరాలను వెల్లడించారు.

పతకాలు సాధించిన స్విమ్మర్లకు అభినందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : సిమ్మింగ్‌లో పతకాలు సాధించిన స్విమ్మర్స్‌ను ఎంఎల్ఏ శ్రీరాం తాతయ్య, అమ్మాజీ దంపతులు ఆదివారం అభినందించి సన్మానించారు. మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు ఈ నెల 10వ తేదీ రాజమహేంద్రవరం మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 7వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ ఛాంపియన్స్ పోటీలలో జగ్గయ్యపేట స్విమ్మర్స్ మహిళలు 11, పురుషులు 11 మంది కలిపి మొత్తం 22 మంది పాల్గొన్నారు. కోచ్‌లుగా పొట్టాబత్తిన పాండురంగారావు, పొట్టాబత్తిన లక్ష్మీ ఉన్నారు. ఎస్‌కెబిఎస్ వర్మ, యన్నాకుల రాంబాబు, యన్నాకుల ఉషారాణి, ఏనుగుల సీతారామమ్మ, కూచిపూడి శ్రీనివాసరావు, యలగందుల భవాని, పరిణం రమాదేవి, తుమ్మడపు నాగమణి, కటికల జయ పావని, రాయపూడి నిహారిక, యంద్రాతి రామారావు వివిధ విభాగాలలో 82 పతకాలు సాధించారు. పసిడి పతకాలు 56, రజిత పతకాలు

16, కాంస్య పతకాలు 10 పథకాలు సాధించారు. ఈ కార్యక్రమంలో డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధులు జనరల్ సెక్రెటరీ కలాలి నరేష్, తుమ్మడపు నారాయణ, ఉపాధ్యాయులు పర్చ లక్ష్మణరావు, యలగందుల మార్కండేయులు, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్లో ప్రీమియర్ లీగ్ షో

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రైతు పేట నారాయణ ఈ - టెక్నో స్కూల్‌లో ఆదివారం ప్రీమియర్ లీగ్ నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, వాలిబల్, పుట్బాల్, షటిల్ తదితర క్రీడలు నిర్వహించారు. ఎజి.యమ్.హరీష్ ముఖ్యఅతిదిగా పాల్గొన్నారు. ఎ.జి.యమ్.హరీష్ , ప్రిన్సిపల్ కుమారస్వామి, ఎఓ.మహేష్, అకాడమిక్ డీన్ - పార్థు హైస్కూల్ కో ఆర్డినేటర్ - శివ రామకృష్ణ, కో ఆర్డినేటర్ - రోజా ఈ - కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ చంద్ర హారిక, ఈ - చామ్స్ వైస్ ప్రిన్సిపాల్ వీర కుమారి, గోపి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - భవానీపురం

ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం కార్తీక వనసమారాధన భవానీపురం పున్నమిఘాట్ కృష్ణా నదీ ఒడ్డున ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, ఆర్య వైశ్య నాయకులు అంబికా కృష్ణ, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, తెనాలి నుంచి బాలస్వామి, అమరావతి శైవ క్షేత్రానికి చెందిన శివస్వామి పాల్గొన్నారు. సుమారు 20 వేల మందికి పైగా కార్తీక వన భోజనాల్లో పాల్గొన్నారు. ఈ

వనసమారాధనలో నృత్యం చేస్తున్న చిన్నారులు

కార్యక్రమంలో వాసవీ ఫౌండేషన్ వివికే నరసింహారావు, విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గడ్డం రవి, వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ అనిల్, వాసవీ క్లబ్ గవర్నర్ సతీష్, విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గడ్డం సత్యనారాయణ పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న డిజిపి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు దంపతులు, ఇటీవల వివాహమైన వారి పెద్ద కుమార్తె గాయత్రి సోనాక్షి, అల్లుడు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం ఆలయ అధికారులు వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

రాజ్‌కుమార్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంకు చెందిన వైసిపి నాయకులు, కాపు సంఘం రాష్ట్ర నేత ఆకుల శ్రీనివాస కుమార్ రెండో కుమారుడు ఆకుల రాజ్ కుమార్ (31) ఆది వారం ఆకస్మికంగా మృతి చెం దారు. రాజ్ కుమార్ ఎంఎస్‌సి ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. కుమారుడు మృతితో ఆకుల శ్రీనివాసకుమార్ కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న పలు రాజకీయ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. రాజ్‌కుమార్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఐడియాఫోర్జ్‌లో నూతన మార్పులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : డ్రోన్ టెక్నాలజీలో అంతర్జాతీయంగా అగ్రగామిగా వెలుగొందుతున్న ఐడియాఫోర్జ్ టెక్నాలజీలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు సంస్థ ఇంఛార్జి కె.కుమార్ తెలిపారు. నగరంలోని డ్రోన్ టెక్నాలజీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విప్లవాత్మక ఫ్లైట్ పెట్రోల్ డ్రోన్‌ను ఒక సేవా పరిష్కారంగా ప్రజాభద్రత, చట్ట అమలులో ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఈ వినూత్న యుఎవి పరిష్కారం ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర ప్రతిస్పందన, నేరాల నివారణలో కొత్త ప్రమాణాన్ని నిర్దేశించనుందని తెలిపారు. చురుకైన ట్రాఫిక్ నిర్వహణ, చట్టాన్ని అమలు చేయడం ద్వారా సురక్షితమైన, తెలివైన నగరాలను రూపొందించడానికి ఐడియా ఫోర్జ్ సహకారం అందిస్తోందని తెలిపారు.

జమలయ్యకు రాష్ట్ర పదవి పట్ల హర్షం

ప్రజాశక్తి - గంపలగూడెం : డిపిఆర్‌టియు (ఉపాధ్యాయ శాఖ) ఎపి రాష్ట్ర కార్యవర్గంలో స్థానిక ఉపాధ్యాయులు బూరుగు జమలయ్యకు చోటు దక్కడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆ శాఖ రాష్ట్ర కార్యాలయంలో కార్యాలయం (విజయవాడ)లో జరిగిన కార్యవర్గ సమావేశంలో జమలయ్య రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షునిగా నియామక పత్రాన్ని అధ్యక్షుడు డి.శ్రీను, ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర్ల చేతులమీదుగా అందుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక,
పదవీ విరమణ, జయంతి, వర్ధంతి,
శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు
అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.